క్లుప్తంగా

గురజాల కమిషనర్‌గా శ్రీమన్నారాయణ



గురజాల: నగర పంచాయతీ కమిషనర్‌గా వైవీఎల్ శ్రీమన్నారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పిడుగురాళ్ల డీఈ వి.శ్రీనివాసరావును అధికారులు సస్పెండ్ చేశారు. గుంటూరు మునిసిపాలిటీ నందు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వైవీఎల్ శ్రీమన్నారాయణ గురజాల కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. పలువురు సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఒప్పిచర్లలో వైభవంగా అయ్యప్ప పడిపూజ



కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో అయ్యప్పస్వామి పడిపూజా మహోత్సవం గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం అర్ధ రాత్రి వరకు వైభవంగా జరిగింది. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పడిపూజలో పాల్గొని అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. బాలకృష్ణ గురుస్వామి తదితరులు అయ్యప్ప పడిపూజా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేలాది అయ్యప్ప మాల ధరించిన స్వాములు పూజలో పాల్గొని అయ్యప్ప స్వామి భజనలలో తరించారు.

కాచవరం మాజీ సర్పంచ్ మృతి



అంకిరెడ్డి (ఫైల్)

కారెంపూడి: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, కాచవరం గ్రామ మాజీ సర్పంచ్ క్రిష్టపాటి అంకిరెడ్డి (70) శుక్రవారం ఉదయం మృతి చెందారు. హైదరాబాదులోని కుమారుడి ఇంటి నుంచి స్వగ్రామం బయలు దేరుతున్న క్రమంలో కుర్చీలో నుంచి అంకిరెడ్డి కుప్పకూలి ప్రాణాలు విడిచారు. గుండెపోటు కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు. ఆయన అనారోగ్యంతో హైదరాబాదులో చికిత్స పొందారు. హైదరాబాదు నుంచి శనివారం ఉదయం అంకిరెడ్డి మృతదేహాన్ని స్వగ్రామం కాచవరం తీసుకురానున్నారు. అంకిరెడ్డి 1981 నుంచి 1986 వరకు కాచవరం గ్రామ సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించారు. ఆ తర్వాత ఆయన సతీమణి జయలక్ష్మి 1999 నుంచి 2004 వరకు సర్పంచ్‌గా సేవలందించారు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు.

డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

గురజాల: న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, నాలుగవ అదనపు జిల్లా జడ్జి శరత్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసులు వెంటనే జాతీయ లోక్ అదాలత్‌లో సత్వరమే పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారులకు సమయంతో పాటు డబ్బులు కూడా ఆదా చేసుకోవచ్చని తెలిపారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

మాచర్ల: రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు సమితి అధ్యక్షుడు మెట్టు గోవింద రెడ్డి శుక్రవారం తెలిపారు. మాచర్ల శ్రీశైలం రోడ్‌లో గల స్వామి వివేకానంద సేవాశ్రమంలో ఆదివారం ఉదయం 7గంటల నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ఉచిత కంప్యూటర్ శిక్షణ కోర్సులో చేరాలనుకునేవారు బయోడేటా ఫామ్స్‌తో తమ కార్యాలయంలో హాజరు కావాలన్నారు.

బయో ఉత్పత్తుల విక్రయ దుకాణాల్లో తనిఖీలు

బొల్లాపల్లి: మండలంలో వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయ అధికారులు ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై శుక్రవారం విస్తృత తనిఖీలు చేశారు. రేమిడిచర్ల, గంగుపల్లి గ్రామాల్లో ఎరువులు, పురుగు మందు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. గంగుపల్లి గ్రామంలో ఎరువులు, పురుగు మందుల దుకాణంలో అనధికారంగా విక్రయాలు జరుపుతున్నట్లు గుర్తించారు. తనిఖీల్లో 29,294 వివిధ కంపెనీల పురుగు మందులు, రూ. 2.97 లక్షల విలువైన ఎరువులు స్వాధీనం చేసుకున్నారు. రూ.2.45 లక్షల బయో ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. రేమిడిచర్ల గ్రామంలో రూ. 2.92 లక్షల విలువైన బయో ఉత్పత్తులను సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జయదేవ్‌రాజన్, వ్యవసాయ శాఖ కార్యాలయం అధికారి సురేష్, అబ్బూరు అంకారావు, వీఆర్వో నన్నేషా, పాల్గొన్నారు.

పులకించిన సత్రశాల



భ్రమరాంబికాదేవి



కనకదుర్గమ్మ

సత్రశాల(రెంటచింతల): అతిపురాతన శైవక్షేత్రంగా పేరుపొందిన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం ప్రాగణమంతా పులకించిపోయింది.కార్తిక మాసం సందర్భంగా శుక్రవారం దేవస్థానం సమీపంలోని పవిత్ర కృష్ణానది ఒడ్డున వేకువజాము నుంచే భక్తులు దీపాలు వెలిగించి, పుణ్య స్నానాలు ఆచరించారు. దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అర్చకులు శివశర్మ నేతృత్వంలో స్వామివార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. హోమాలలో పాల్గొన్నారు. వందలాది భక్తులకు, వివిధ స్వామి మాలలు స్వీకరించిన మాలదారులకు అన్నదానం చేశారు. మండల పరిధిలోని పాలువాయి జంక్షన్ వద్ద వేంచేసిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం నందు అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో గాదె రామిరెడ్డి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఈఓ గాదె రామిరెడ్డికి ఆకాశదీపం అందజేత

సత్రశాలకు ఆకాశ దీపం వితరణ

మండల పరిధిలోని సత్రశాల వద్ద వేంచేసిన అతి ప్రాచీన శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానానికి స్థానిక పరాశక్తి విద్యుత్ విభాగం వారు ఆకాశ దీపంను అందజేసినట్లు ఈఓ గాదె రామిరెడ్డి, దేవస్థానం ప్రధాన అర్చకులు చిట్టేల శివశర్మ శుక్రవారం తెలిపారు. కార్తిక మాసం సందర్భంగా దేవస్థానంలోని స్వామివార్లను దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలకు చెందిన వేలాదిమంది భక్తులు తరలివస్తున్నట్లు తెలిపారు. కార్తిక మాసం సందర్భంగా దేవస్థానంలో ఆకాశ దీపం ఏర్పాటు చేయడం వల్ల ప్రతిరోజు సాయంత్రం ఆకాశదీప మహోత్సవం నిర్వహించు సమయంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ఆడపిల్ల చదువు సమాజానికి వెలుగు



వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎంపీడీవో, అధికారులు

పిడుగురాళ్ల: ఆడపిల్ల చదువు సమాజానికి వెలుగు అని పిడుగురాళ్ల ఎంపీడీవో రామచంద్రయ్య అన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో శుక్రవారం బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని ఐసీడీఎస్ పిడుగురాళ్ల ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో రామచంద్రయ్య హాజరై మాట్లాడుతూ...ఆడపిల్లలు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తే సమాజంలో మార్పులు సాధిస్తారన్నారు. బాల్య వివాహాలు జరిగే ప్రదేశాలను ముందుగానే గుర్తించి, ఆ ప్రాంతంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే ప్రొటేషన్ ఆఫీసర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ... ఫోక్స్ చట్టం, చైల్డ్ మ్యారెజ్ యాక్ట్, చైల్డ్ యాక్ట్‌పై అవగాహన కల్పించారు. సీడీపీవో రుక్సానా మాట్లాడుతూ... హెల్ప్ లైన్ నెంబర్లు ప్రతి ఒక్కరు తెలుసుకొని ఉంటే బాల్య వివాహాలు అరికట్టే అవకాశం ఉంటుందని, హెల్ప్ లైన్ నెంబర్లకు సమాచారం అందిస్తే అధికారులు వచ్చి బాల్య వివాహాలు నిలుపుదల చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల పట్టణం, మాచవరం మండలంకు సంబంధించి అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎస్‌కే, వెల్ఫేర్ సెక్రటరీ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ సరోజినిదేవి, సూపర్‌వైజర్లు

రెంటచింతల: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఎంపీడీఓ సరోజినిదేవి అన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ బాలికలను చదివించడం (అక్షరాస్యతను పెంపొందించడం)ద్వారా వారి హక్కులను కాపాడేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చట్టాలపై, బాలికల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా బాల్య వివాహాలను అరికట్టవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వం బాలికలకు, మహిళలకు రక్షణ కల్పించేందుకు న్యాయ సంహిత చట్టంలో అనేక మార్పులను తీసుకువచ్చినట్లు వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా బాలికల విద్యపై తల్లిదండ్రులు దృష్టి పెట్టినప్పుడే బాలికలు అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు ఎస్.కృష్ణారెడ్డి, ప్రదీప్ కుమార్‌రెడ్డి, ఈవోపీఆర్డీ కృష్ణారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎ.నాగమణి, వై.శ్రీదేవి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మహిళా కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

రెవెన్యూ, భూ సమస్యలపై తక్షణమే స్పందించాలి

- విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని వీడండి
- నరసరావుపేట ఆర్డీవో కె.మధులత



శావల్యాపురంలో మాట్లాడుతున్న ఆర్డీవో మధులత

బొల్లాపల్లి: విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని వీడి సమస్యపై తక్షణమే స్పందించాలని నరసరావుపేట ఆర్డీవో కె.మధులత అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. రెవెన్యూ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలస్థాయి రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ గతంలో అయ్యన్నపాలెం, రావులాపురం రెవెన్యూ గ్రామాల పరిధిలో అనర్హులకు అసైన్‌మెంట్ కమిటీలో భూ పంపిణీ చేశారని, దీన్ని గుర్తించి తొలగించాలన్నారు. భూమిలేని నిరుపేదలను గుర్తించి అర్హులైన లబ్ధిదారులకు అసైన్‌మెంట్ కమిటీలో భూ పంపిణీ చేయాలన్నారు. రెవెన్యూ, భూసమస్యల పట్ల అలసత్వం లేకుండా తక్షణమే పరిష్కరించాలని సూచించారు. నియోజక వర్గంలో బొల్లాపల్లి మండలం పట్టభద్రుల ఓటర్ల నమోదులో ప్రథమ స్థానంలో ఉండటం చెప్పుకోదగ్గ విశేషమని, 1282 పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించినట్లు ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.వి.సుధాకర్, వీఆర్వోలు, సర్వేలు తదితరులు ఉన్నారు.

జవాబుదారిగా పనిచేయాలి

శావల్యాపురం: రెవెన్యూ అధికారులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని నరసరావుపేట ఆర్డీవో కె.మధులత అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని ఆర్డీవో ఆకస్మికంగా సందర్శించారు. మండలంలోని పోట్లూరు, పిచికలపాలెం తదితర గ్రామాల్లో మ్యూటేషన్ అర్జీలు 49 పెండింగ్‌లో ఉన్నాయని వీఆర్వోల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. వీఆర్వోలు విధుల్లో ఆలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రీసర్వే భూములపై వచ్చిన అర్జీలను విచారణ చేసి సత్వరమే సంబంధిత రైతులకు న్యాయం చేయాలన్నారు. భవిష్యత్‌లో భూ సమస్యలు రాకుండా ఉండటానికి పాత రికార్డులన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రెవెన్యూ కార్యాలయంలో పాత రికార్డులను భద్రపరిచే గది పరిశీలించారు. అనంతరం గ్రామాల వారిగా విఆర్వోల పనితీరు పెండింగ్‌లో ఉన్న అర్జీల గురించి తహసీల్దారు కె.సుజాత అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు పేరిసోముల నాసరయ్య, సర్వేయర్ యం.రాజు, సీనియర్ సహాయకులు చంద్రబాబు ఉన్నారు.

ఈపూరులో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

విద్యుత్ అక్రమ చౌర్యం చేస్తున్న వారికి రూ.7.39 లక్షల అపరాధ రుసుం

ఈపూరు: విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం సభ్యులు జిల్లా పర్యవేక్షణ ఇంజనీర్ డాక్టర్ పి. విజయకుమార్ ఆధ్వర్యంలో ఈపూరు సెక్షన్, ఇనిమెళ్ల, అంగలూరు, చిట్టాపురం, కె.ఉప్పరపాలెం, శ్రీనగర్, వడ్డెంగుంట ఏరియాల్లో శుక్రవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్.వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్. రాంబట్లు మాట్లాడుతూ ఈ తనిఖీల్లో 43 మంది అధికారులు, 126మంది సిబ్బంది 43 బృందాలుగా ఏర్పడి 2740 సర్వీసులను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో మీటరు లేకుండా డైరెక్టుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 40 మందికి రూ.1.03లక్షలు, మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 10మందికి రూ.3.05 లక్షలు, అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న 3మందికి రూ.14వేలు, అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 82మందికి రూ.3.17లక్షలు మొత్తం రూ.7.39 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు వివరించారు. విద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత విద్యుత్ చట్టంకు లోబడి ఉంటాయని తెలిపారు. వినియోగదారులు నిబంధనల ప్రకారం విద్యుత్‌ను వినియోగించుకోవాలన్నారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను 9440812263, 9440812360 నంబర్లకు నేరుగా లేదా వాట్సప్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ దాడుల్లో డీఈఈలు ఎన్. మల్లికార్జునప్రసాద్, బి. వెంకటేశ్వరరెడ్డి, ఏఈలు కె. కోటేశ్వరరావు, ఎ. చంద్రశేఖర్, ఆపరేషన్ ఏఈ ఎస్.గాంధీబాబు, ఆపరేషన్ డీఈఈ, ఏఈఈలు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

మాచర్ల: స్థానిక కేశానుపల్లిలోని ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 10న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కళాశాల యాజమాన్యం శుక్రవారం తెలిపింది. పట్టణంలోని జండా చెట్టు బజార్‌లోని ముస్లిం షాదీ ఖానాలో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి, ఈఎన్‌టీ వైద్య శిబిరం నిర్వహిస్తారన్నారు. వైద్య శిబిరంలో ప్రముఖ ఈఎన్‌టీ వైద్య నిపుణులు డాక్టర్ షేక్ వశీం మీరా వైద్య పరీక్షలు చేస్తారన్నారు. వైద్య పరీక్షలు చేయించుకునేవారు రేషన్ కార్డు, వోటర్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో రావాలన్నారు.

డీఎస్పీని కలిసిన మానవ హక్కుల కమిషన్ సభ్యులు




గురజాల: డీఎస్పీ బి.జగదీష్‌ను ఉభయ రాష్ట్రాల మానవ హక్కుల కమిషన్ సైకామ్ కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం డీఎస్పీని కలిసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మానవ హక్కులకు భంగం వాటిల్లకుండా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల కమీషన్ విచారణాధికారి కన్నెర రవి తదితరులున్నారు.

24 గంటల్లో దొంగల అరెస్ట్

రెంటచింతల: మండలంలోని మంచికల్లు గ్రామంలో గురువారం రాత్రి చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గ్రామానికి చెందిన శీలంనేని అనంతరామయ్య తన భార్య మంగమ్మతో కలిసి వారి కుమారుడు గోపి పెళ్లి శుభలేఖలు బంధుమిత్రులకు పంపిణీ చేయడానికి పలు గ్రామాలకు వెళ్లి రాత్రి ఇంటికి వచ్చారు. ఇంటి తలుపులు తెరచి ఉండటంతో పాటు బీరువా పగలగొట్టి పెళ్లికి కొనుగోలు చేసిన 12.5 సవర్ల బంగారు నగలు చోరీకి గురైనట్లు గుర్తించి గురువారం రాత్రి 10.30 గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. వెంటనే గ్రామానికి చేరుకుని బాధితులను, ఇంటి పరిసరాలను, చుట్టుపక్కల వారిని విచారించారు. పెళ్లి సందర్భంగా ఇంటికి రంగులు వేయడానికి వచ్చిన మాచర్ల మండలం గన్నవరం గ్రామానికి చెందిన పాముల రాహుల్‌రావు, కందుకూరి అన్నారావు ఇద్దరే ఈ చోరీకి పాల్పడినట్లు అనుమానించి, అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారన్నారు. చోరీ జరిగిన 24 గంటలు గడవక ముందే నిదితులను పోలీసులు అదుపులోకి తీసుకుని నగలు స్వాధీనం చేసుకోవడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణవేణి టాలెంట్ స్కూల్ టీచర్లకు వర్క్ షాప్



మాచర్ల: హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో ఉన్న రెండు తెలుగు రాష్ట్రాల కృష్ణవేణి టాలెంట్ స్కూల్ - ది మాస్టర్ మైండ్స్ స్కూల్స్ ఫౌండర్ చైర్మన్ ఎస్.రాజు ఆధ్వర్యంలో టీచర్లకు వర్క్ షాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్కూల్ చైర్మన్ ఎస్.రాజు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు మైండ్ సెట్ కి అనుగుణంగా నూతన విద్యా విధానంపై సులభ రీతిలో చదువును అభ్యసించాలన్నారు. తద్వారా పోటీ పరీక్షల్లో సైతం ప్రతిభ కనబరుస్తారన్నారు. ఈ విధానాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి సంవత్సరం నూతన విద్యా విధానం అలవర్చుకునేందుకు పాఠశాల ఉపాధ్యాయులకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ హనుమంతరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు నివేశన స్థలాలు మంజూరు చేయాలి



ఆర్డీవోను సత్కరిస్తున్న సంఘం నాయకులు

గురజాల: నిరుపేదలకు నివేశన స్థలాలు మంజూరు చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారి మురళీకృష్ణను దళిత భహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుక్కమూడి ప్రసాద్ కోరారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో శుక్రవారం ఆర్డీవో మురళీ కృష్ణను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ పేద కులాలు సాగు చేసుకుంటున్న భూమికి పట్టాలు ఇవ్వాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు రావల్సిన పరిహారాన్ని త్వరితగతిన అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పేరుపోగు జార్జి, మాచవరపు నాగేశ్వరరావు, సిద్దెల బాబురావు, జి కాశయ్య, మహిళా నాయకురాలు కొరదల జ్యోతి తదితరులున్నారు.

నైపుణ్య గణనపై శిక్షణ తరగతులు



శిక్షణ తరగతిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రసాద్

వెల్దుర్తి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న నైపుణ్య గణన సర్వే ప్రారంభమౌతున్న తరుణంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న నైపుణ్య గణనపై పలు సూచనలు చేసి శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. సచివాలయ సిబ్బందికి స్కిల్ సెన్సెస్ కో-ఆర్డినేటర్ కిరణ్ నాయక్ ద్వారా సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. సచివాలయ సిబ్బందికి ఫోన్‌లో మొబైల్ అప్లికేషన్ గురించి అవగాహన కల్పించటం జరిగిందన్నారు. ఇందులో 15 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు గల వారికి నైపుణ్య గణన సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గురజాల రూరల్: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నైపుణ్య గణనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గౌసియా భేగం మాట్లాడుతూ గ్రామాల్లో వివిధ వృత్తుల్లో మంచి నైపుణ్యం కలిగిన యువతను సర్వేచేసి గుర్తించాలన్నారు. ఉన్నత చదువులు చదువుకుని ఉపాధి కోసం ఎంతో మంది గ్రామాల్లో ఎదురుచూస్తున్నారన్నారు. సర్వేను ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ సైదారావు తెలిపారు. 220 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా 33 ఏవీ ఫీడర్స్ సప్లై నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఉదయం 10 నుంచి 1 గంటల వరకు పిడుగురాళ్ల టౌన్ లోని 33/11 కేవీ యరపతినేని నగర్ సబ్ స్టేషన్‌కు విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా రైల్వే స్టేషన్ రోడ్డు, జానపాడు రోడ్డు, ఆడితి సెంటర్, చెరువు కట్ట బజారు, కళ్లం టౌన్ షిప్ ఏరియా, పోలీస్ స్టేషన్ వైపు పోలీస్ స్టేషన్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. కావున వినియోగదారులు ఈ అంతరాయాన్ని గమనించగలరని తెలిపారు.

కారెంపూడి: మండలంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని విద్యుత్తు సబ్ స్టేషన్లలో అలాగే, విద్యుత్తు లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్తు సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

వెల్దుర్తి: మాచర్ల నియోజకవర్గంలోని డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏడీఏ రామయ్య శుక్రవారం అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని 132/33 కేవీ గుండ్లపాడు, మాచర్ల టౌన్, సబ్ స్టేషన్‌లైన మాచర్ల, వెల్దుర్తి, దుర్గి మండలాల్లోని అన్నీ గ్రామాలలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందన్నారు. 33 కేవీ ఫీడర్స్ పరిధిలో లైన్స్ మెయింటనెన్స్, చెట్లు కొమ్మలు నరకటం, సబ్ స్టేషన్ మెయింటనెన్స్, రోడ్డు వైండింగ్ వర్క్స్ జరుగుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందన్నారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలో గల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

ఏఎం రెడ్డి కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

నరసరావుపేట రూరల్: ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల కార్యదర్శి ఆట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. 40మంది విద్యార్థులు శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి ఆట్లూరి శాంతి మాట్లాడుతూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా సమాజంలో ఎన్నో ప్రాణాలను రక్షించవచ్చని తెలిపారు. రక్తదానం వలన శరీరంలో రక్తకణాలు సమృద్ధిగా అభివృద్ధి చెందడానికి దోహదపడుతుందన్నారు. తద్వారా మనిషి ఆరోగ్యంగా నూతన ఉత్సాహంతో ఉండవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ సయ్యద్ రహమతుల్లా, కళాశాల ప్రిన్సిపల్ భార్గవ్ భూషణ్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు శంకర భారతీపురం విద్యార్థులు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

నరసరావుపేట రూరల్: జాతీయస్థాయి ఆట్యాపాట్యా, తైక్వాండో పోటీలకు శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి శుక్రవారం తెలిపారు. ఆట్యాపాట్యా పోటీలలో పాఠశాలకు చెందిన విద్యార్థినులు బి.సౌజన్య, టి.లక్ష్మీప్రసూన చంద్రిక, డి.రంగ మహాలక్ష్మీ, ఎం.స్నేహరెడ్డి, బాలురలో సి.హెచ్ వెంకటగురు ప్రశాంత్‌రెడ్డి, పి.వరప్రసాద్ రెడ్డిలు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. తమిళనాడు ఈరోడ్‌లో ఈనెల 8, 9, 10 తేదీలలో జరిగే జాతీయస్థాయి పోటీలలో వీరు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. అలాగే తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో ఎం.శివసాయిశ్రీకర్, టి.జాన్‌పాల్, జి.దేవరాజ్‌లు ప్రథమస్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. వీరిని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు జి.ఝాన్సీరాణి, ఎస్‌కె. ఫాతిమా, పి.తిరుపతిరావు, సత్యనారాయణ, కరీముల్లా, శంకరరావు, వెంకటేశ్వరరెడ్డి, సత్యవాణి, లక్ష్మీ, పావని, లక్ష్మీబాయ్‌లు అభినందించారు.

క్లాప్ మిత్రలకు అవగాహన సదస్సు

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చెత్త సంపద కేంద్రాల్లో పనిచేయుచున్న క్లాప్ మిత్ర, షెడ్డు మిత్రలకు ఐసీటీ వారి సారధ్యంలో చేయాల్సిన విధులు బాధ్యతలపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న లైఫ్ ఇన్సూరెన్స్ పథకాల గురించి అవగాహన కల్పించి పథకంలో భాగస్వామ్యులు కావాలన్నారు. ఈకార్యక్రమంలో ఐటీసీ జిల్లా కోఆర్డినేటరు సీహెచ్.శ్రీనివాస్,కె. ఏసోబు, ఈవోపిఆర్‌డి పి.సుగుణ పాల్గొన్నారు.